## ఊటుకూరులో రైతులకు అవగాహన సదస్సు



**విడవలూరు,డిసెంబర్ 24 ప్రభాతవార్త :** మండలంలోని గాదెలదిన్నె, ఊటుకూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారిని సిహెచ్.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. వరి, వేరుశెనగ సాగు చేసే రైతన్నలు క్రమబద్ధతిలో ఎరువులు వాడుకోవాలి. పంటల్లో ఏదైనా సమస్య అందుబాటులో విఏఏలను సంప్రదించి పరిష్కారం చేసుకోవాలి, వేరుశెనగ, వరి పంటలు సాగు చేస్తున్న రైతులు పురుగు మందులు వ్యవసాయ సిబ్బంది చెప్పిన ప్రకారంగా వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, విఏఏ ప్రవీణ్,వర్షిత పాల్గొన్నారు.

## ఓటర్లు జాబితా ప్రక్రియ వేగవంతం చేయాలి: స్ఫూర్తిరెడ్డి



**కొడవలూరు,డిసెంబర్ 24 ప్రభాతవార్త :** ఎన్నికల ఓటర్ల జాబితా నమోదు ప్రక్రియలో వీఆర్ఓలు పూర్తి పరిశీలన చేసి మ్యాప్ తయారు చేయాలని స్థానిక తహశీల్దార్ కె. స్ఫూర్తిరెడ్డి పేర్కొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్ఓలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల లిస్టును క్రమసంఖ్యలో నమోదు పరచి మ్యాప్ తయారు చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు సాధ్యమైనంత వరకు పరిష్కరించాలి, ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంల డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ హైమావతి, విఆర్ఓలు పాల్గొన్నారు.

## యవ్వనస్తులకు దుస్తులు పంపిణీ



**బుచ్చి డిసెంబర్ 14 ప్రభాతవార్త :** క్రిస్మస్ సందర్భంగా క్రీమ్ స్వచ్ఛంధ సేవా సంస్థ ఆద్వర్యంలో అధ్యక్షులు డాక్టర్ తడిసిన ఇజ్రాయిల్ జొన్నవాడ గిరిజన కాలనీలో యవ్వనస్తులకు సుమారు 70 మందికి వస్త్ర దానం చేశా రు.క్రీమ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా చీరలు పంపిణీ, ప్లేట్లు పంపిణీ, గ్లాసులు,నీటిబుక్స్ పెన్సిళ్ళు పరీక్ష అట్టలు పం పిణీ, చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.ఈ డ్రస్సులు వారికి ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు.

## శాస్త్రోక్తంగా ముగిసిన శ్రీ వేణుగోపాల స్వామి పవిత్రోత్సవాలు



**ముత్తుకూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త :** ముత్తుకూరు మండలం కృష్ణపట్నం గ్రామంలోని ఎన్నో వందల సంవత్సరాల చరిత్ర ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయాన్ని నూతనంగా పున నిర్మించిన సందర్భంగా వేద పండితులు శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు బుధవారంతో ముగిసింది.శ్రీ వేణుగోపాల స్వామి వారి పవిత్రోత్సవంను ఈ నెల 22 నుండి 24 వరకు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశా లతో అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక సలహాలతో జరిపిన దేవాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి వి గిరికృష్ణ, దేవస్థాన ఛైర్మన్ మామిడాల శ్రీనివాసులు సిబ్బంది కలిసి పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. హోమ పూజల్లో గ్రామ ప్రజలు, చుట్టు ప్రక్కన గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొ న్నారు. అనంతరం పవిత్రమైన పవిత్రో కంకణాలను ప్రతి ఒక్కరు మెడలో ధరించి పవిత్రోత్సవంలో పాల్గొ న్నారు. హోమ పూజ ముగిసిన అనంతరం అన్నదాన ప్రసాదంను వచ్చిన భక్తులందరికి అందజేసారు.

## రౌడీ షీటర్ పై పీడీ యాక్ట్ నమోదు

**నెల్లూరు క్రైమ్ డిసెంబర్ 24 ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్‌గా నమోదై ప్రవర్తనలో ఎటువంటి మార్పు రాకుండా తరచూ నేరాలకు పాల్పడుతున్న స్థానిక దొరతోపు కాలనీకి చెందిన సురేంద్ర వీరయ్య (35) అనే రౌడీషీటర్ పై రూరల్ పోలీసులు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పీడీ యాక్ట్ నమోదు చేశారు. నిందితుడిని కడప కారాగానికి తరలిస్తున్నట్లు రూరల్ సీఐ జి. వేణు తెలిపారు.

## ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీనివాసులు



**కోవూరు,డిసెంబరు 24 ప్రభాతవార్త :** కోవూరు ఎంపీడీవోగా పనిచేస్తున్న శ్రీహరిరెడ్డి తేలికపాటి ప్రమాదానికి గురి కావడంతో దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న శ్రీనివాసులును ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ ఈ మేరకు జిల్లా పరిషత్ నుంచి బుధవారం ఆదేశాలు అందాయి. ఈ సందర్భంగా ఆయనను పంచాయతీ కార్యదర్శులు పూలమొక్కతో ప్రత్యేకంగా అభినందించారు.

## క్రిస్మస్ వేడుకలకు చర్చీల ముస్తాబు



**కోవూరు,డిసెంబరు 24ప్రభాతవార్త :** కోవూరులోని ప్రధాన రహదారిలో ఉన్న కోవూరు ప్రధాన చర్చి క్రిస్మస్ వేడుకలకు పూర్తిస్థాయిలో ముస్తాబు అవుతుంది. గురువారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని వంద ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ చర్చిని విద్యుత్ దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించేలా నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించారు. అదేవిధంగా మండలంలోని లక్ష్మీనగర్, లేగుంటపాడు, పాటూరు, గంగవరం, పోతిరెడ్డిపాలెం లో ఉన్న చర్చిలను విద్యుద్దీపాలతో వైభవంగా అలంకరించేలా చర్యలు తీసుకున్నారు.

## ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



**కోవూరు, డిసెంబరు 24 ప్రభాతవార్త :** కోవూరులోని పెళ్లకూరు కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ఉన్న చిన్నారులు వివిధ రకాల ఫ్యాన్సీ డ్రస్సులు వేసి ప్రతి ఒక్కరిని ఆనందింపజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ ఉమా, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, నాగమ్మ, సుమతి, ముత్యాలమ్మ, ఆయాలు లక్ష్మీ, శైలజ, షాహినలు ఉన్నారు.

## చాంపియన్ ఫార్మర్స్‌కు కిట్లు



**కోవూరు, డిసెంబరు 24 ప్రభాతవార్త :** కోవూరు సహాయ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించి చాంపియన్ ఫార్మర్స్‌గా ఎంపిక చేసిన 82 మందికి సుమారు 2 వేలు విలువ చేసే పురుగుమందులు ఆకర్షించే పరికరాలు, ట్రైకోగామా కార్డులు , గ్రోమార్ నోవా యూరియా బాటిళ్లను అందజేసేలా ప్రణాళికలు రూపొందించడం జరిగిందని సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత అన్నారు. కోవూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ పంటలను నాశనం చేసే పురుగులను ఆకర్షించి తద్వారా అవి నశించిపోయేందుకు ఈ పరికరాలు ఎంతో ఉపయోగ పడతా యన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన చాంపియన్ పార్మర్స్‌ను వీటిని పంపిణీ చేసేలా ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. తక్కువ ఖర్చుతో తెగుళ్లను ఆశించే పురుగులను నశింపజేసేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

## బజార్ సెంటర్‌లో బస్ షెల్టర్ తొలగింపు



**కోవూరు, డిసెంబరు 24 ప్రభాతవార్త :** కోవూరులోని బజారు సెంటర్‌లో గత 20 సంవత్సరాలకు పైగా ఆశించిన మేర ఎవరికి ఉపయోగపడని బస్‌షెల్టర్‌ను ఎట్టకేలకు పంచాయతీ అధికారులు తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వాస్తవంగా ఈ బస్‌షెల్టర్ ఏర్పాటు చేసిన ఉద్దేశం మంచిదే అయినా దీనిని ఎవరూ ఆశించిన మేర ఉపయోగిం చకపో వడంతో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ బస్‌షెల్టర్‌ను జేసీబీతో తొలగించే కార్యక్రమానికి సంబంధించిన పంచాయతీ అధికారులు చొరవ చూపి అక్కడి నుంచి దానిని తొలగించారు.

## అంగన్‌వాడీ కేంద్రంలోప్రీ క్రిస్మస్ వేడుకలు



కోవూరు, డిసెంబరు 24 ప్రభాతవార్త : కోవూరు మండలం ఇనమడుగు సెక్టార్ పరిధిలోని అట్ల కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ప్రీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ప్రమీల మాట్లాడుతూ ప్రతి కేంద్రంలో ఇటువంటి వేడుకలను నిర్వహించి చిన్నారులకు పండుగలు అంటే ఏమిటో తెలియజెప్పేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇందులో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మల్లీశ్వరి, మంజుల, ఆయాలు దివ్య, పద్మ, తల్లులు హాజరయ్యారు.

## వక్ఫ్ ఆస్తుల డిజిటలైజేషన్ ద్వారా 15 వేల ఎకరాల వక్ఫ్ భూమిని గుర్తించాం



**నెల్లూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త -వైద్యం** నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నందు ఏపీ వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా వక్ఫ్ అమ్మెండ్మెంట్ యాక్ట్ వచ్చిన తరువాత వక్ఫ్ ఆస్తులు అన్ని డిజిటలైజ్ చేయాలన్న నిబంధనలను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. డిజిటలైజేషన్ ద్వారా వక్ఫ్ ఆస్తులు పోతాయన్న అపోహ ప్రజలకు ఉండేదని, వాస్తవానికి డిజిటలైజేషన్ ద్వారా 15 వేల ఎకరాల వక్ఫ్ భూమిని గుర్తించగలిగామని తెలిపారు. డిజిటలైజేషన్ కాకముందు 3790 వక్ఫ్ సంస్థలకు గాను 65 వేల ఎకరాలు ఉండేవని, డిజిటలైజేషన్ తర్వాత 5028 వక్ఫ్ సంస్థలకు గాను 81 వేల ఎకరాలు నమోదు అయ్యాయని తెలిపారు. తనకు వక్ఫ్ బోర్డు ఛైర్మన్ పదవి ఇచ్చినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేవాలయ ఆస్తులను ఎలా కాపాడుతారో వక్ఫ్ ఆస్తులను కూడా అలాగే కాపాడాలని తనకు చెప్పారని అన్నారు. డిసెంబర్ ఆరవ తేదీతో పోర్టల్ ముగిసిందని ఎంతోమంది ఆందోళన చెందుతున్నారని ఏపీ వక్ఫ్ బోర్డ్ తరఫున వక్ఫ్ ట్రిబ్యునల్ లో కేసు వేసి ఆరు నెలల అధిక గడువును సాధించామని తెలిపారు. నేటి నుండి పోర్టల్ తిరిగి ప్రారంభమైందని సెల్ఫ్ స్టైల్ కమిటీలతో నడుస్తున్న సంస్థలన్నీ వక్ఫ్ బోర్డ్ లో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. వక్ఫ్ బోర్డ్ లో నమోదు చేస్తే తమ కమిటీ పోతుందని అపోలో ఉన్నారని, ప్రస్తుతం ఎవరైతే మేనేజ్ చేస్తున్నారో వారే కమిటీలుగా ఉంటారని తెలిపారు. తమ కంట్రోల్లోనే తమ మసీదు గానీ దర్గా కానీ ఉంటాయని తెలిపారు. భారతదేశంలో ప్రస్తుతం ఒక వ్యక్తికి ఆధార్ కార్డు ఎంత ముఖ్యమో వక్ఫ్ ఆస్తులను కూడా డిస్టలైజ్ చేయడం అంతే ముఖ్యమని అన్నారు. దేవాలయాలు మసీదులు దర్గాలు చర్చిలకు సంబంధించిన ఆస్తులు వ్యక్తి ఆస్తులు కావని అవి దేవుని యొక్క ఆస్తులని అవి కచ్చితంగా ఎన్రోల్ చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో ప్రతి అంగుళం భూమిని కాపాడాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని ఎవరైతే ఇప్పటివరకు పోర్టల్ లో నమోదు చేయలేదో వారు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. నమోదు చేసుకునేందుకు ఎటువంటి సందేహాలున్న రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ కార్యాలయాన్ని, మీ జిల్లాల్లో ఉన్న ఇన్స్పెక్టర్లను సంప్రదించాలని కోరారు. తమ బోర్డు ఏర్పడి ఏడాది కాలం పూర్తయిందని కొన్ని అనివార్య కారణాలవల్ల సంక్షేమ పథకాలు అందించడంలో కొద్దిగా వెనకబడ్డామని, ఈ ఏడాది వక్ఫ్ బోర్డు తరపున ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు తీసుకురాబోతున్నామని తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నుంచి 500 మంది పేద విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ ద్వారా ఉచిత ఇంటర్మీడియట్ విద్య అందించబోతున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 20 ప్రదేశాల్లో స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేయబోతున్నామని మహిళలకోసం ట్రెడిషనల్ స్కిల్స్ ట్రైనింగ్స్ ప్రారంభించ బోతున్నామని తెలిపారు. నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గాలో మంత్రులు ఫరూక్, నారాయణ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సహకారంతో దాదాపు 15 కోట్ల రూపాయలతో షాహి మసీదు నిర్మించబోతున్నామని, దాదాపు వీటి డిజైన్స్ అన్ని ఫైనలైజ్ అయిపోయాయని జనవరిలో టెండర్ పిలవబోతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దీనికి 5 కోట్ల మంజూరు చేశారని, ఆయనను మరలా కలిసి నిధుల మంజూరు చేయవలసిందిగా కోరుతామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ తహసీన్, కార్పొరేటర్ కరిముల్లా, నన్నేసాహెబ్, నగర మైనారిటీ అధ్యక్షులు రియాజ్, ఇంతియాజ్, మైనుద్దీన్ పాల్గొన్నారు.

## అయ్యప్పగుడి ఫ్లైఓవర్ వద్ద స్ట్రిప్ జాయింట్ పనుల పరిశీలన



నెల్లూరు రూరల్ డిసెంబర్ 24 ప్రభాతవార్త శరవేగంగా మినీ బైపాస్ రోడ్డు అభివృద్ధినెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని అయ్యప్పగుడి ఫ్లైఓవర్ వద్ద ప్రస్తుతం జరుగుతున్న స్ట్రిప్ జాయింట్ పనులను టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆర్ !! బి (ఎన్.హెచ్.) అధికారులతో కలిసి శుక్ర వారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.రూ.13 కోట్ల వ్యయంతో చేపట్టిన మినీ బైపాస్ రోడ్డు పనులు, బాక్స్ కల్వర్ట్ నిర్మాణం, అయ్యప్పగుడి ఫ్లైఓవర్ వద్ద స్ట్రిప్ జాయింట్ పనులు ఇప్పటికే శరవేగంగా కొనసాగుతున్నాయని కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా మినీ బైపాస్ రోడ్డు పనులు, ఫ్లైఓవర్ వద్ద స్ట్రిప్ జాయింట్ పనులు వేగంగా ముందుకు సాగుతు న్నాయని, అతి త్వరలోనే అన్ని పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు.నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ మినీ బైపాస్ రోడ్డు పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని ఈ సందర్భంగా గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు, సమయపాలనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇంచార్జ్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు అరవ శ్రీనివాసులు, క్లస్టర్ ఇంచార్జ్ కనపర్తి గంగాధర్, కో-క్లస్టర్ ఇంచార్జ్ ఎల్.పి. కృష్ణారెడ్డి, 23వ డివిజన్ కార్పొరేటర్ దుద్దుగుంట (ఒరిస్సా) శ్రీనివాసులు రెడ్డి, 23వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు మేకల మధు, 26వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు బూడిద పురుషోత్తం యాదవ్‌తో పాటు పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అభివృద్ధి పనులు పూర్తయితే రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడి ప్రజలకు ఉపశమనం కలుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## శేషు స్కూల్లో అంగరంగ వైభవంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు



**నెల్లూరు రూరల్ డిసెంబర్ 24 ప్రభాతవార్త** బుజ బుజ నెల్లూరు లోని శేషు స్కూల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యుత్ దీపాలంకరణతో చర్చి, క్రిస్మస్ ట్రీ, పశువుల పాకలో బాల ఏసు విగ్రహం, శాంతా క్లాజ్, నక్షత్రాల తోరణాలతో స్కూల్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.శశికళ మేడమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులు, తల్లిదండ్రులను ఎంతగానో అలరించాయి. చిన్నారులు ప్రదర్శించిన క్రిస్మస్ గీతాలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ శేషు గారు మాట్లాడుతూ, ఏసుప్రభువు బోధిం చిన క్షమాగుణం, ప్రేమ, కరుణ వంటి విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని సూచిం చారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందాలంటే ఈ విలువలు ఎంతో అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు జశ్వంత్, టిప్పు సార్, అవినాష్, రాహుల్‌తో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## మాట ఇచ్చారంటే అనుకున్న సమయానికి పూర్తి చేస్తారంతే

**- 48వ డివిజన్లో ప్రజల చిరకాల కోరికను నెరవేర్చిన మంత్రి**

**- సబ్‌స్టేషన్ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి**



**నెల్లూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త -వైద్యం :** నగరంలోని 48వ డివిజన్ పొర్లుకట్ట ప్రాంత వాసుల చిరకాల కోరికను మంత్రి నారాయణ తీరుస్తున్నారు. అందులో భాగంగా సబ్ స్టేషన్ కాంపౌండ్ వాల్‌నిర్మాణ పనులను మంత్రి నారాయణ ఆకస్మికంగా పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును మంత్రి నారాయణ అడిగి తెలుసుకున్నారు. ఖచ్చితంగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని మంత్రి నారాయణ అధికారులకు తెలియజేశారు. అయితే స్థానిక సమస్య చెప్పిన గంటల వ్యవధిలోనే నిధులు కేటాయించి పరిష్కార మార్గం చూపిన మంత్రికి స్థానిక ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విజన్ ఉన్న నాయకుడు మా మంత్రి నారాయణ అని, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, ఇన్‌చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, నగర పార్టీ అధ్యక్షులు మామి డాల మధు, కార్పొరేటర్లు, డివిజన్ ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు.

## రూ.108 కోట్లతో సర్వేపల్లిలో ఆర్డీఎస్ఎస్ పనులు



**నెల్లూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త -వైద్యం :** పనులు నత్తనడకన సాగుతుండడంపై ఎమ్మెల్యే సోమిరెడ్డి అసహనం. నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచన. నెల్లూరులోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఎస్ఈ రాఘవేంద్రంతో కలిసి ఈఈ, డీఈ, ఏడీ, ఏఈలతో ఎంఎల్ఏ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమీక్ష. ఫీడర్ల వారీగా పనులపై ఆరా, 63 ఫీడర్ల పరిధిలో రూ.108 కోట్లతో పనులు చేపట్టినట్లు వెల్లడించిన అధికారులు. 11 ఫీడర్ల పరిధిలో పనులు పూర్తయినట్లు, 19 ఫీడర్ల పరిధిలో పనులు ప్రారంభం కాలేదని, మిగిలిన ఫీడర్ల పరిధిలోని వివిధ దశల్లో పనులు జరుగుతున్నట్లు వెల్లడి. అదనపు సిబ్బందిని సమీకరించుకుని నిర్ధేశిత సమయంలో పనులన్నీ పూర్తి చేయాలని స్పష్టం చేసిన సోమిరెడ్డి.

## వంద రోజుల ప్రణాళికను సద్వినియోగం చేసుకోవాలి



కోవూరు, డిసెంబరు 24 ప్రభాతవార్త : పదవ తరగతి విద్యార్థులు వంద రోజుల ప్రణాళికను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న విజయదీపిక, ఇటీవల యూటీఎఫ్ మండల శాఖ అందించిన మోడల్ పేపర్‌లను చదివితే తప్పనిసరిగా సత్ఫలితాలు వస్తాయన్నారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని పర్వీన్ మాట్లాడుతూ ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ పిల్లలపై ఉన్న ప్రత్యేకమైన అభిమానంతో పదవ తరగతి చదువుతున్న 170 మంది విద్యార్థులకు అల్పాహారం అందించారని, ఇందుకు ఆమెకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## వీర బాల దివస్‌ను విజయవంతం చేయండి



**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 24, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా డిసెంబర్ 26న వీర బాల దివస్ కార్యక్రమాన్ని జరుపుకుంటున్న తరుణంలో నెల్లూరు జిల్లాలోనూ పెద్ద ఎత్తున వీర బాల దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షులు సిఫారెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం భారతీ య జనతా పార్టీ కార్యాలయంలో జరిగిన సమా వేశం లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 10వ సిక్కుల మత గురువైన గురు గోవిం ద సింగ్ కుమారులు బాబా జొరవర్ సింగ్, బాబా పతే సింగ్ అనే బాల వీరులు, భరత మాత స్వేచ్ఛ కోసం సంస్కృతి సాంప్రదాయాల కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని, ఇస్లాం మతోన్మాదుల చేతిలో వీర మరణం పొందారని అలాంటి వీరుల ధైర్య సాహసాలని త్యాగనీరతిని స్మరించుకుంటూ డిసెంబర్ 26న వీర బాల దివస్ ను జరుపుకుంటున్నామని తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యా సంస్థలు,గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాలలో వారి త్యాగాన్ని గురించి ప్రజా నీకానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యాకసిరి ఫణిరాజు, ముక్కు రాధాకృష్ణ గౌడ్,మండ్ల ఈశ్వరయ్య,కరణం సుభాషిణి,సుజన,తిరకాల శివ,పొట్టి శివ,లాల్ ఖాజా మస్తాన్,చిన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా వద్దు..నెల్లూరు జిల్లా ముద్దు అంటూ రిలే ధీక్షలు



**రాపూరు,డిసెంబు24ప్రభాతవార్త :** తిరుపతి జిల్లా వద్దు..నెల్లూరు జిల్లా ముద్దు అందుకే నెల్లూరు జిల్లా మాకు కావాలి అంటూ రాపూరు మండల జెఏసి 4వ రోజు రిలే నిరాహార దీక్షలు బుధవారం రాపూరు రెవెన్యూ కార్యలయం బయట నిర్వహి ంచారు. ఈ సందర్భంగా పలువురు జెఏసి నాయకులు, తెలుగు దేశం పార్టీ నాయకులు ఈ దీక్ష శిభిరంలో మాట్లాడుతూ ప్రజల మనోభావాలను గౌరవించే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాపూరు,కలువాయి, సైదాపురం మండలాల ప్రజల అభీష్టం మేరకు ఈ మండలాలను నెల్లూరు జిల్లాలోనే వుంచాలని డిమాండ్ చేశారు.

## మండలంలో మూడు లింక్ రోడ్లకు మంజూరు



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త:** మండలంలో దెబ్బతిన్న రహదారుల కారణంగా రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మండలంలోని మూడు ముఖ్యమైన లింక్ రోడ్ల నిర్మాణానికి తాజాగా మంజూరు లభించినట్లు అధికారులు వెల్లడించారు. మంజూరైన రోడ్లలో చెన్నపల్లిపాలెం నుంచి కొత్తపాలెం, పేడూరు నుంచి చింతోపు, చిన్న చెరుకూరు నుంచి చింతారెడ్డిపాలెం ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గం ఉన్నాయి. ఈ రహదారులు గ్రామాలను సమీప పట్టణాలతో అనుసంధానించే కీలక మార్గాలుగా ఉండటంతో, వీటి అభివృద్ధి వల్ల స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మరికొన్ని దెబ్బతిన్న రోడ్లపై కూడా పూర్తి స్థాయి నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించినట్లు వెల్లడించారు. వాటికి కూడా త్వరలోనే మంజూరు లభించే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. లింక్ రోడ్ల వల్ల కలిగే ప్రయోజనాలు ఈ లింక్ రోడ్లు నిర్మాణం పూర్తయితే గ్రామాల నుంచి పట్టణాలకు రాకపోకలు మరింత సులభమవుతాయి. ముఖ్యంగా రైతులు తమ పంటలను మార్కెట్లకు తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో తరలించుకునే అవకాశం ఏర్పడుతుంది. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు సురక్షితంగా ప్రయాణించగలుగుతారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు చేరుకోవడంలోనూ ఈ రోడ్లు కీలకంగా మారనున్నాయి. దీంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ఆర్థిక చైతన్యానికి ఈ లింక్ రోడ్లు దోహదపడతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధిగా పోనేబోయిన

**- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, ఎంపీ ప్రభాకర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు పోనేబోయిన**



**ఇందుకూరుపేట, డిసెంబర్ 24, ప్రభాతవార్త :** నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధిగా నన్ను నియమించిన కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, జిల్లా పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్రకి పార్టీ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో ఐదు సంవత్సరాలు రాక్షస పాలనకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటాలు చేసి నెల్లూరు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నా వంతు కృషి చేయడమైంది. కోవూరు నియోజకవర్గంలో ముఖ్యంగా ఇందుకూరుపేట మండలంలో పార్టీ బలోపేతానికి తీవ్ర స్థాయిలో కృషి చేయడమైంది. శాసనసభ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి వచ్చుటకు బడుగు, బలహీన వర్గాల్లో విశేషంగా కృషి చేయడమైంది. గత జడ్పీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మా సతీమణి పొన్నబోయిన లక్ష్మీ పోటీ చేయడమైంది. పునూరు గ్రామ సర్పంచ్‌గా మూడు సార్లు ఎన్నిక కావడం అయింది. తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా పార్టీ కార్యక్రమాలు, ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై చేయు విమర్శలను సమర్ధవంతంగా తిప్పికొట్టగలరని పార్టీ ప్రభుత్వ ప్రతిష్ఠను శాసనసభ్యులు పార్లమెంట్ సభ్యులు వారి ప్రతిష్ఠను పెంచే విధంగా శక్తి వంచన లేకుండా పనిచేయగలనని నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి పోనేబోయిన చెంచు కిషోర్ తెలియజేశారు.

## వన్ మంత్ వన్ విలేజ్ కార్యక్రమంతో రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



**లింగసముద్రం, డిసెంబర్ 24, ప్రభాతవార్త :** లింగసముద్రం మండల పరిధిలోని చినపవని గ్రామంలో రెండవ విడత వన్ మంత్ వన్ విలేజ్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం మండల వ్యాప్తంగా ప్రారంభమైందని తహసీల్దార్ ఎం.కోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామాన్ని నెల రోజుల పాటు నాలుగు విడతలలో సందర్శించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపడతామని తహసీల్దార్ వివరించారు. భూమి సమస్యలు పట్టాదార్ పాస్ పుస్తకాలు టైటిల్ డీడ్, రికార్డులు సవరణ సర్వే అంశాలు వంటి రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ గ్రామ సభలో ప్రజల నుంచి 9 వినతులు వచ్చాయన్నారు. మ్యూటేషన్ సంబంధించి 1, ఇతర భూ సమస్యలకు సంబంధించి 8 అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమణయ్య, వీఆర్వో నాగరాజు, సర్వేయర్ శివ, సచివాలయ సిబ్బంది, రైతులు, ప్రజలు, అర్జీ దారులు తదితరులు పాల్గొన్నారు.

## మమ్మల్ని నెల్లూరు జిల్లాలోనే వుంచేలా చూడండి

## ..ఎమ్మెల్యే రామకృష్ణకు రాపూరు నేతల వినతి



రాపూరు,డిసెంబరు24ప్రభాతవార్త రాపూరు మండలాన్ని ఇప్పుడు వున్న విధంగానే నెల్లూరు జిల్లాలోనే వుంచేలా చూడాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణను పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, రాపూరు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్యక్షుడు చెన్ను అశోక్ రెడ్డి, రాపూరు మండల జెఎసి నాయకులతో కలసి వినతి పత్రం సమర్పించి కోరారు. ఈ సందర్భంగా తిరిపాల్ రెడ్డి, అశోక్ రెడ్డి మాట్లాడుతూ రాపూరు మండలానికి నెల్లూరుతో విడదీయరాని అనుబంధం వుందన్నారు. ఈ ప్రాంతవాసులకు నెల్లూరు ఎంతో సౌకర్యవంతంగా సోంత ఇంటిలా వుంటుందన్నారు. ఇంతే కాక కండలేరు డ్యాం కూడా మండలం తిరుపతి జిల్లాకు వెలితె సగం డ్యాం తిరుపతి, సగం డ్యాం నెల్లూరు జిల్లాకు వెలుతుందన్నారు. దీంతో వ్యవసాయంపై అధారపడి జీవనం సాగించే తమకు సాగునీటికి ఎన్నో ఇబ్బందులు ఎదురైతాయని వారు తెలిపారు. దీంతో పాటు నెల్లూరుకు ప్రయాణం చేయాలంటే తమకు 1 గంట ప్రయాణం కాగా తిరుపతికి వెల్లాలంటే సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో పాటు అక్కడికి వెల్లాలంటే సుమారు 4 గంటల పైచిలుకు సమయం పడుతుందని తెలిపారు. మండలాంలోని అన్ని వార్గల ప్రజలు తిరుపతి జిల్లాలో రాపూరును కలపడాన్ని వ్యతిరేకిస్తున్నారని, కావున ప్రజల అభీష్టం మేరకు మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కోనసాగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే రామకృష్ణ రెండు రోజుల క్రింతం తాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యలయంలో కలసి రాపూరు,కలువాయి, సైదాపురం మండలాలను ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా నెల్లూరు జిల్లాలోనే వుండేలా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాపూరు మండల ప్రజల అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకోని వెల్లిన ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణకు చెన్ను తిరిపాల్ రెడ్డి, చెన్ను అశోక్ రెడ్డి, రాపూరు మండల జెఏసి నాయకులు ధన్యవాధాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాపూరు క్లస్టర్ ఇన్‌చార్జ్ నల్లవడ్ల వెంకటరమణా రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి, ఉపాధ్యాక్షుడు మధునాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి ఫతాన్ ఛాన్ భాషా, కార్యదర్శి కూనిపోగు కన్నయ్య, అకిలివలస, బోజ్జనపల్లి, తూమాయి గ్రామ సర్పంచ్‌లు చెన్ను పెంచల రెడ్డి, ఏటూరు నాగభూషణం రెడ్డి, పైడిపూల చంద్రమోహన్, మాజీ యంపీపీ ఇసళ్ళ సూర్యప్రకాష్, బిసి నాయకులు కూకాటి పెంచలయ్య, మందాటి చంద్రమోహన్, నాయకులు నల్లవడ్ల రాధాకృష్ణా రెడ్డి, సమయం ప్రసాద్, రమేష్, జెఏసి నాయకులు దామిశెట్టి సురేష్, సికిందర్, షోహెల్ షాన్, అహమద్, ఆరీఫా, తదితరులున్నారు.

## జిఆర్‌కె కుటుంబాన్ని పరామర్శించినసోమిరెడ్డి



**మనుబోలు డిసెంబర్ 24 ప్రభాతవార్త :** మనుబోలు మండలం పిడూరుపాళెం మాజీ సర్పంచ్ గాలి వెంకటసుబ్బారెడ్డి భౌతిక కాయానికి బుధవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాళులర్పించారు. వెంకటసుబ్బారెడ్డి సోదరుడు సర్వేపల్లి ఏఎంసి చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డితో పాటు కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సర్పంచ్‌గా సొసైటీ డైరెక్టర్‌గా సేవలందించడంతో పాటు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పనిచేశారని అన్నారు. పేదలు,రైతుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపేరన్నారు. వెంకటసుబ్బారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని,కుటుంబసభ్యులకు మనో ధైర్యం కల్పించాలని భగవంతుని ప్రార్ధిస్తున్నానని అన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి మండలాద్యక్షులు పొన్నూరు రామకృష్ణయ్య, సర్వేపల్లి నియోజకవర్గం తెలుగుయువత అద్యక్షులు శివుడు రాజాగౌడ్,నాయకులు వెందోటి బాస్కర్‌రెడ్డి,కలికి సుధీర్‌రెడ్డి, కలికి రమేష్‌రెడ్డి ,రావుల జితేంద్రగౌడ్ తదితరులున్నారు.

## క్రిస్మస్ కానుక అందజేసిన డిఎస్‌పి మోజస్‌పాల్



**కావలి,డిసెంబర్ 24 ప్రభాతవార్త :** పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన సంఘంలో ఉన్న చర్చికి గత కొంతకాలంగా కరెంటు లేక చీకట్లో ఉంటున్నాము చర్చికి కరెంటు మీటర్ పెట్టించండి అని ఆ ప్రాంత గిరిజన వృద్ధ మహిళల కోరిక మేరకు డిఎస్‌పి భోగి మోజస్‌పాల్ బుధవారం కరెంటు మీటర్ పెట్టించి చర్చ్‌లో క్రిస్మస్ వెలుగులు నింపి వారి కళ్ళలో ఆనందాన్ని చూడడం జరిగింది. అదే విధంగా పేద గిరిజన సంఘస్థులు కూడా క్రిస్మస్ పండగ రోజు ఘనంగా జరుపుకోవాలని డిఎస్‌పి బోగిరి మోజస్ పాల్, బోగిరి కవితపాల్ దంపతులు వారికి నిత్యవసర సరుకులు మరియు చీరలు, పండ్లు పంపిణీ చేసి వారికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గిరిజన సంఘస్తులు సంఘ కాపరి వారి దాతృత్వానికి బోగిరి మోజస్‌పాల్ దంపతులకు చిరుసత్కారం చేసి వారి కృతజ్ఞత చాటుకొన్నారు. ఈ కార్యక్రమంలో మద్దూరుపాడు మాజీ సర్పంచ్ రావులకొల్లు బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి జిల్లా అధ్యక్షుడ్ని కలిసిన రావి లక్ష్మీ నర్సారెడ్డి



**చేజర్ల డిసెంబర్ 24 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఎంఎల్‌సి బీద రవిచంద్రను బుధవారం చేజర్ల మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రావి లక్ష్మీ నరసారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీదరవిచంద్రను శాలువాతో సన్మానించి పుష్ప గుచ్చం అందజేసి అభినందనలు తెలియజేశారు.

## తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించిన తోట



**కావలి,డిసెంబర్ 24 ప్రభాతవార్త :** ప్రభాకర్ పదవతరగతి విద్యార్థులకు నెల్లూరుజిల్లా విద్యాశాఖ ప్రతిష్టా త్మాకంగా చేపడుతున్న 100రోజుల యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా బుధవారం కావలి రూరల్ మండలంలోని సర్వాయపాలెం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాద్యాయులు తోట వెంకటేశ్వర్లు ప్రతిరోజూ ఎస్ఎస్‌సి వంద రోజుల యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా గైర్హాజరైన ఆనెమడుగు, మొండి డిన్నెపాలెం గ్రామాల విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్ళి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఆ విద్యార్థులను పాఠశాలకు రప్పిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వందరోజుల యాక్షన్‌ప్లాన్ ప్రకారం ప్రతిరోజూ సాయంత్రం ఒకొక్క సబ్జెక్టుల్లో 20మార్కులు చొప్పున స్లిప్‌టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని వెంటనే ఆ పరీక్షా జవాబుపత్రాలు వాల్యూచేసి అప్లోడ్ చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులను క్రమం తప్పకుండా తమ బిడ్డలను పాఠశాలలకు పంపించాల్సిందిగా కోరినారు.

## నాగుల వెల్లటూరులో పొలం పిలుస్తోంది



**చేజర్ల డిసెంబర్ 24 ప్రభాతవార్త :** చేజర్ల మండలం నెర్నూరు,నాగుల వెలటూరు గ్రామ రైతు సేవా కేంద్ర ంలో బుధవారం పొలం పిలుస్తొంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో మండల వ్యవ సాయ విస్తరణాధికారి సుజాత పాల్గోని అనంతరం మాట్లాడుతు రైతులందరు వరి నారుమడిలో జింకు లోపం ఉన్నట్లు అయితే చిలెట్ జింకు 12 శాతం స్ప్రే చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా వరి పంట వేసిన ప్రతి ఒక్క రైతులకు ఎకరాకి మూడు యూరియా బస్తాలు చొప్పున రైతు సేవా కేంద్రంలో ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. ప్రతి రైతు వరి పంటకు ఎకరానికి 168 రూపాయాలు ఇన్సూరెన్స్ చేసుకోవాలని తెలియజేశారు. వరి పంటపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయాధికారులు నాగభూషణం శ్రీను రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవు



**కావలి, డిసెంబర్ 24 ప్రభాతవార్త :** ప్రభుత్వ భూములను ఆక్రమించి కట్టడాలను నిర్మిస్తే చర్యలు తప్పవని కావలి మున్సిపల్ కమీషనర్ జి.శ్రావన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ మాట్లాడుతూ బుధవారం కావలి పట్టణ పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కటటడాలపై పురపాలక సంఘం వారు చర్యలు చేపట్టడమైనదని తెలిపారు. పట్టణ పరిధిలోని మందాడి చెరువుగట్టులో ఆక్రమణలు పురపాలక సంఘం సిబ్బంది తొల గిం చడమైందన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మించి ఉన్న నిర్మాణ దశలో ఉన్నా మరియు ఆక్రమించిన అటువంటి కట్టడములను కూల్చివేయబడును మరియు వారిపై క్రిమినల్,సివిల్, చట్టపరమైన చర్యలు చేపట్టబడునని హెచ్చరించడమైంది.

## యూరియా కొరతకు తెరపడింది

**– 270 మంది రైతులకు ఎరువు పంపిణీ**



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త :** మం డలంలోని కామాక్షి నగర్ రైతు భరోసా కేంద్రంలో బుధ వారం వ్యవసాయ శాఖ అధికారులు సానుకూలంగా స్పంది ంచి రైతులకు యూరియా సరఫరా చేశారు. సాగుదారుల అవసరాలను గుర్తించిన అధికారులు మొత్తం 270 మంది రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఇటీవల యూరియా కొరతపై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టడంతో, జిల్లా వ్యవసాయ శాఖ ఈ సమస్యను తక్షణమే పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చొరవతో 400 బస్తాల యూరియా కేటాయింపు జరిగిందని సిపిఎం నేతలు తెలిపారు. అవసరమైతే మరొక దఫా యూరియా సరఫరా కూడా చేపడతామని అధికారులు హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తోటపల్లి గూడూరు మండల వ్యవసాయ అధికారిణి శిరీష రాణి మాట్లాడుతూ పంట వేసిన ప్రతి రైతుకు యూరియా అందించాలన్న లక్ష్యంతో జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి సూచనల మేరకు సరఫరా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఎరువులు అందించేందుకు వ్యవసాయ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. రైతుల సమస్యపై స్పందించినందుకు సిపిఎం నేతలు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో పాటు వ్యవసాయ శాఖ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్యయ్య, సభ్యులు మారు బోయిన రాజా, బండి శౌరి తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## అంకమ్మ నేత్రదానం పలువురికి ఆదర్శప్రాయం



**కావలి,డిసెంబర్ 24 ప్రభాతవార్త :** పిట్టు అంకమ్మ నేత్రదానం పలువురికి ఆదర్శప్రాయం అని రెడ్‌క్రాస్ ప్రతినిధులు తెలిపారు. స్థానిక రైతుబజార్ వ్యాపారి పిట్టు అంకమ్మ(75) బుధవారం తెల్లవారుజామున మెదడు సంబంధిత వ్యాధితో ముసునూరులోని స్వగృహంలో మరణించారు. ఆమె అల్లుడు బిజెపి నాయకులు పొన్నగంటి మురళీక్రిష్ణటీమ్ సీనియర్స్ మరియు రెడ్‌క్రాస్‌కు సమాచారం ఇచ్చి నేత్రదానం చేయించారు. నెల్లూరుజిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన కార్నియారికవరీ స్పెషలిస్టు సునీల్ ఆమె నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మనవుడు టీం సీనియర్స్ ప్రతినిధి పొన్నగంటి సాయి దీరజ్ మాట్లాడుతూ తమ అమ్మమ్మ పిట్టు అంకమ్మ నేత్ర అవయదానంపై అవగాహన కలిగి ఉండి తన మరణానంతరం నేత్రాలను దానం చేయమని చెబుతుండేదని ఆ మేరకు రెడ్‌క్రాస్‌కు నేత్రదాన ప్రతిజ్ఞపత్రం కూడా అందించిందని అన్నారు. ఆమె కోరికను తీర్చినందుకు మరో ఇద్దరు కార్నియల్ అందులకు చూపు కల్పిస్తున్నందుకు గర్విస్తున్నామన్నారు. ఆమె భౌతికాయానికి యూటిఎఫ్ నాయకులు పొన్నటంటి మాదవరావు, టీం సేవియర్స్ అద్యక్షులు ఎన్.ప్రణీత్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డి.రవిప్రకాస్ కలికి శ్రీహరిరెడిడ, పలువురు బిజెపి నాయకులు, పూర్వ ఏబివిపి నాయకులు, టీం సెవియర్స్ సభ్యులు నివాళులర్పించారు. ఆమె నేత్రదానం ఆదర్శప్రాయం అని ఇది కావలి రెడ్‌క్రాస్ ద్వారా జరిగిన 157వ నేత్రదానమని, కావలి రెడ్‌క్రాస్ నేత్రదాన విభాగ కన్వీనర్ ఇలింద్ర శ్రీవాణి తెలిపారు.

## పల్లెలో క్రిస్మస్ పండుగ సంబరాలు



**సైదాపురం, డిసెంబర్ 24, ప్రభాతవార్త :** సైదాపురం మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని సంబరాలు మొదలయ్యాయి. చర్చిలు వెలుగుల కాంతులతో ముస్తాబు అయ్యాయి. ప్రపంచంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకునే పండుగ క్రిస్మస్. రక్షకుడైన యేసుక్రీస్తు సర్వమా నవాళిని రక్షించడానికి భూమిపై ఆరాధించిన శుభదినం క్రిస్మస్ పర్వదినమని క్రైస్తవ సోదరుల ప్రగాఢ విశ్వాసం. ఈ వేడుకలకు పల్లె సీమలలోని క్రైస్తవ దేవాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. విద్యుత్ దీపాలతో , కాంతులతో, పల్లె సీమలు ప్రభువు ప్రార్ధనలతో పులకించిపోతున్నాయి. దేవుడు లోకమును ఎంతో ప్రేమించాడని బైబిల్లోని వాక్యాలను వివరిస్తూ ప్రార్ధనలు కొనసాగుతున్నాయి. చిన్న పెద్ద తారతమ్యమేమి లేకుండా క్రిస్మస్ ప్రార్ధనలలో పల్లె ప్రజలు పులకించిపోతున్నారు.

## జింక్ లోపంపై రైతులకు అవగాహన శిరీష రాణి



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త :** మండలంలోని ముంగల దొరువు, చింతోపు, సౌత్ ఆములూరు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో మండల వ్యవసాయ అధికారిణి శిరీషా రాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముంగల దొరువు గ్రామ ంలో ఛాంపియన్ షిప్‌కు చెందిన రైతు పొలాన్ని ఆమె క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పంటలో జింక్ లోపం ఉన్నట్లు గుర్తించిన శిరీష రాణి, ఆ లోపం వల్ల పైరు ఎదుగుదలపై పడే ప్రతికూల ప్రభావాన్ని రైతులకు వివరించారు. జింక్ లోపాన్ని సవరించేందుకు రైతులు చెలేటెడ్ జింక్ (12 శాతం)ను హెక్టారుకు ఒక కిలో మోతాదులో వినియోగించాలని సూచించారు. ఇలా చేయడం వల్ల పంట ఆరోగ్యంగా పెరిగి దిగుబడి మెరుగవుతుందని తెలిపారు. అలాగే రైతులు వ్యవసాయ శాఖ ఇచ్చే సూచనలు, సలహాలను క్రమం తప్పకుండా పాటిస్తూ సాగు చేస్తే వ్యవసాయం మరింత లాభసాటిగా మారుతుందని ఆమె పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో పంట సమస్యలను గుర్తించి, తగిన పరిష్కారాలను అందించడమే పొలం పిలుస్తుంది కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని శిరీష రాణి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## పక్షవాతం వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ



**ముత్తుకూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త :** కృష్ణపట్నంలో పక్షవాతం వ్యాధిగ్రస్తులకు శ్రీ హరిహరాదుల సేవాసమితి, పాండురంగయ్య మిత్రుల ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు 15 మందికి పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కృష్ణపట్నం అదాని ఫౌండేషన్ సిఆర్ హెడ్ రాకేష్ రంజన్, మృత్యుంజయ రాము,టిడిపి మండల యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ,భాస్కర్ నాయుడులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ హరిహరాదుల సేవా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. పక్షవాతం వ్యాధి గ్రస్తులకు బియ్యం, వంట సామాన్లు పంపిణీ చేయడం చాలా మంచి కార్యక్రమం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిషితమ్మ, రమేష్,వెంకటరమణయ్య,హరి,సురేష్,శివకృష్ణ, భాస్కర్, సెల్వరాజ్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

## రత్నం ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**బుచ్చి డిసెంబర్ 24 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం రత్నం ఇంగ్లీషు మీడియం హైస్కూలులో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్న పిల్లలు వేషదారణలు ఆకట్టుకున్నాయి. ఆటపాటలతో అలరించారు.స్కూల్ కరస్పాండెంట్ చెంగల మల్లికార్జునరావు మాట్లాడుతు లాటిన్ బాషలో క్రైస్ట్ అనగా క్రీస్తు మాస్ అనగా ఆరాధన అంటే క్రీస్తును ఆరాధించి ఆయనను కీర్తిస్తు ఆనందమే క్రిస్మస్ అనిమరియు ఏసుక్రీస్తు బోధించిన మతం క్రైస్తవ మతం,క్రైస్తవులు క్రైస్తవ మతాన్ని పాటిస్తారు.క్రైస్తవులు చేసుకునే పండుగలో క్రిసమస్ పండుగ అత్యంత ప్రీయమైనది. ఏసు క్రీస్తు జన్మించిన రోజు డిసెంబర్ 25 వ తేది క్రీస్తు పుట్టిన రోజు నాడే క్రిస్మస్ పండును ప్రపంచంలోనే క్రైస్తవులంతా మిక్కిలి ఆనందోత్స హాలతో వేడుకగా జరుపుకుంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిఫల్ షేక్. రోషన్‌హామీద, ఉపాధ్యాయులు ,ఉపాద్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయంలో ఫ్రీ క్రిస్మస్ వేడుకలు



**వింజమూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త :** క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏసుప్రభు కీర్తనలు ఆలపించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొని, యేసు ప్రభువు యొక్క యేసు గొప్ప తనాన్ని వివరించి ప్రార్ధనలు చేశారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మేరిమాత ముద్దు బిడ్డ విశ్వ మానవాళికి ప్రేమ, కరుణ, దయ, సేవా గుణాలను పంచిపెట్టి లోక కళ్యాణం కోసం భూమి మీదకి వచ్చిన ఏసుక్రీస్తు పుట్టిన రోజు వేడుకలు సందర్భంగా ముందుగా ఫ్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వేణుగోపాల్ మేజర్ పంచాయతీ ఈఓ కే.రామారావు, టీడీపీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, జనసేన అధ్యక్షులు సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు గురజాల గోపి, టీడీపీ నాయకులు, ఇతర శాఖ ఉద్యోగులు తదితరులు, నాయకులు పాల్గొన్నారు.

## చర్చిలకు స్వీట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**వింజమూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త :** ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మండలంలోని అన్ని చర్చిలకు స్వీట్ బాక్సులను పంపిణీ చేశారు. మండలంలో 35 చర్చిలకు 2000 మంది క్రైస్తవ సోదరులకు స్వీట్ బాక్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఎంతో స్వచ్ఛమైన మనసుతో గత మూడు సంవత్సరాల నుండి క్రిస్మస్ పర్వదినాన క్రైస్తవ సోదరులు ఆనందోత్సాహాలతో వేడుకలు జరుపుకోవాలని వారికి స్వీట్ బాక్సులు అందిస్తూ వారి పట్ల ఉన్న ప్రేమాభిమానాలను చాటుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గురజాల గోపి, మండల ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసులు నాయుడు, చర్చి పాస్టర్లు తదితరులు ఉన్నారు.

## జనవాణిలో ఏఎస్‌పేట హెడ్‌క్వార్టర్‌కు బస్టాండ్ నిర్మాణం కావాలి

**– జనసేన మండల అధ్యక్షుడు అక్బర్‌బాషా**



**అనుమసముద్రంపేట,డిసెంబరు24,ప్రభాతవార్త :** ఏఎస్‌పేట మండల హెడ్‌క్వార్టర్‌కు బస్టాండ్ నిర్మాణం కావాలని మంగళగిరిలో జనసేన పార్టీ కార్యాలయంలో జనవాణి కార్యక్రమంలో ఏఎస్‌పేట మండల జనసేన అధ్యక్షుడు సయ్యద్ అక్బర్‌బాషా అర్జీ అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండల హెడ్‌క్వార్టర్ అయినప్పటికీ ఏఎస్ పేటలో ఇప్పటికీ బస్టాండు లేకపోవడం వలన ప్రయాణీకులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అర్జీలో వివరించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన హజరత్ సయ్యద్ ఖాజా నాయబ్‌రసూల్ దర్గాకు వచ్చే భక్తులకు కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం కూడా అర్జీలో ప్రస్తావించామన్నారు.ప్రజల సమస్యలపై స్పందించే జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో ఈసమస్యకు తక్షణ పరిష్కాం లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో చిరంజీవి యువత అధ్యక్షుడు దాడి భానుకిరణ్, జనసేనపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ట్రాలీని ఢీకొన్న బైక్ - ఒకరు మృతి



**మర్రిపాడు ,డిసెంబరు24,ప్రభాతవార్త :** నెల్లూరు–ముంబాయి జాతీయరహదారిపై అచ్చమాంబ గుడి సమీపంలో పంచర్ అయ్యి నిలిపిఉన్న ట్రాక్టర్ ట్రాలీని బుధవారం బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న మండలంలోని పొంగూరు గ్రామానికి చెందిన సద్దా సుబ్బరాయుడు(58) అక్కడికక్కడే మృతిచెందాడు. సుబ్బరాయుడు మండలంలోని ఇర్లపాడు నుంచి పొగాకు నారు తీసుకొస్తూ అచ్చమాంబ గుడివద్ద ప్రమాదానికి గురయ్యాడు. ఈప్రమాదంలో సుబ్బరాయుడు మృతిచెందారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సిరివెళ్ళ గ్రామంలో విద్యుత్ అధికారుల అత్యుత్సాహం

**ఆత్మకూరు,డిసెంబరు24,ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని బి.చిరువెళ్ళ గ్రామంలో విద్యుత్ అధికారులు అత్యుత్సాహం చూపారు. గ్రామంలోని దళితకాలనీలో సుమారు 6గంటల కు 30ఇళ్ళకు విద్యుత్ నిలిపివేశారు. గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకుంటుండగా విద్యుత్ నిలిపివేశారు. దాంతో కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. కొంతమంది విద్యుత్ బిల్లులు చెల్లించలేదని, మరికొందరికి మీటర్లు లేవని అధికారులు తెలిపారు.

## క్రీస్తు జీవితం మానవాళికి గొప్ప సందేశం



**ఆత్మకూరు ,డిసెంబరు24,ప్రభాతవార్త :** ప్రేమ,కరుణ, త్యాగం, ధాతృత్వం వంటి వాటి ద్వారా శాంతియుత మార్గాన్ని ప్రభువు ఏసుక్రీస్తు మానవాళికి అందించారని, ఆయన జీవితం మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. జీసెస్ తన జీవితం ద్వారా సన్మార్గానికి బాటలు వేశారని, ఆయన బోధనలు ఆచర ణీయమని, క్రిస్మస్ అందరిలోను సంతోషం నింపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కరుణామయుడైన ప్రభువు ఏసు దీవెనలు అందిరికి లభించాలని, ఈక్రిస్మస్ అందరికి సంతోషాన్ని , ప్రశాంతతను పంచాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ఆధ్వర్యంలో బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు



**ఇందుకూరుపేట, డిసెంబర్ 24, ప్రభాతవార్త :** ఇటీవల ఇందుకూరుపేట మండలంలోని ఆరో మైలు వద్ద వరుసగా ప్రమాదాలు చోటు చేసుకోవడంపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తున్నట్లు టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు ఏకొల్లు పవన్ రెడ్డి బుధవారం అన్నారు. కొన్ని టెక్నికల్ ఇబ్బందులు వల్ల ఇక్కడ బ్రిడ్జి నిర్మా ణం ఆలస్యం అయినట్లు ఆయన చెప్పారు. ఇప్పుడు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ తొలి దశలోనే సమస్యను గుర్తిం చారన్నారు. చాలా కష్టతరమైన రోడ్డును సాధించగలిగారని, త్వరలోనే టెండర్లు పిలిచి త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం అయ్యేలా కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ మధ్య డైవర్షన్, లైటింగ్ కోసం సొంత నిధులతో ప్రొటెక్షన్ బారికేడ్లు ఏర్పాటు చేయించారని అయితే ఇటీవల వర్షాలు, వదర వల్ల భారికేడ్లు దెబ్బతిన్నాయని వివరించారు. గత ప్రభుత్వంలో బ్రిడ్జికి పడిన రంధ్రం, డైవర్షన్ రోడ్డుకు ఎన్ని నెలలు పట్టిందో అప్పుడు పని చేసిన వారే ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. అదృష్టవశాత్తు ఇక్కడ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, అవగాహన లేకుండా మాట్లాడుతున్న వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. బ్రిడ్జి పనులు ప్రారంభించే వరకు సరైన భద్రత ప్రమాణాలు పాటించాలని బుధవారం పరిశీలనకు వచ్చిన ఆర్‌అండ్‌బి, ఇరిగేషన్ అధికారులు, పోలీసు శాఖ వారిని కోరామని ఆయన చెప్పారు.

## దివ్యాంగురాలికి అండగా నిలిచిన సక్షమ్ సేవా సంఘం



**ఇందుకూరుపేట, డిసెంబర్ 24, ప్రభాతవార్త :** గంగపట్నం గ్రామంలో నివాసముంటున్న దొప్ప భారతి అనే దివ్యాంగురాలు తాను నివాసం ఉంటున్న ఇంటి స్థలం వివాదం అయింది. ఆ ఇంటి స్థలం ప్రభుత్వ స్థలమని దాన్ని ఖాళీ చేయాలని స్థానిక అధికారుల నుండి తీవ్రమైన ఒత్తిడి రావడంతో సహాయం కోసం సక్షమ్ సేవా కేంద్రంను సంప్రదించారు. మన సక్షమ్ ప్రతినిధులు ఇందుకూరుపేట మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు శ్రీకైలాసం శ్రీనివాసులురెడ్డిని ఈ సమస్యను పరిష్కరించాలని కోరింది. వారు మండల స్థాయి అధికారులతో మాట్లాడి భారతికి ఆ ఇంటి స్థలంనకు నివాస స్థల ఆదీన దృవీకరణ పత్రం ప్రభుత్వం ద్వారం అందే విధంగా పరిష్కరించారు. అందుకు కృతజ్ఞతలు తెలియజేయుటకు దివ్యాంగురాలైన భారతి, వారి కుటుంబ సభ్యులు, సక్షమ్ కార్యకర్తలు, దివ్యాంగ మిత్రులు పాల్గొన్నారు. దివ్యాంగులకు ఏ సమస్య వచ్చినా సక్షమ్ ద్వారా నన్ను సంప్రదించండి నేను మీకు అన్ని వేళల వెన్నుదండుగా ఉంటానని తెలియజేశారు.

## డీలర్లు సమయపాలన తప్పనిసరి



**బిట్రగుంట డిసెంబర్ 24 ప్రభాతవార్త** మండలంలోని రేషన్ డీలర్లు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని మండల డిప్యూటీ తాసిల్దార్ భరత్ కుమార్ చెప్పారు. మండల తహసీల్దార్ కార్యాల యంలో బుధవారం మండల రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ డీలర్లు వినియోగదారులకు అందుబాటులో ఉండి సక్రమంగా సరుకులు పంపిణి చేయాలన్నారు. ప్రభుత్వం అందజేసిన ఆదేశాల మేరకు వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దనే సరుకులు అందించాలని ఆదేశించారు. సమావేశం లో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## జీసస్ ఆశీసులతో ప్రజలు సంతోషంగా జీవించాలి : ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు రూరల్ డిసెంబర్ 24 ప్రభాతవార్త** కరుణ, క్షమ, ప్రేమ, సహనం, దయాగుణం ప్రజలకు ఏసుక్రీస్తు తన జీవితం ద్వారా అందించిన మహోన్నత విలువలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం క్రిస్మస్ సందర్భంగా జిల్లా ప్రజలకు, క్రిస్టియన్ సోదరులకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. బాధల్ని ఓర్చుకుని తనను నమ్మిన ప్రజల కష్టనష్టాల్లో భాగం పంచుకుని ప్రాణత్యాగం చేసిన ఏసుక్రీస్తు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. కష్టంలోనే విజ్ఞానం వికసిస్తుందన్న సందేశాన్ని ఇచ్చి అందరినీ సన్మార్గం వైపు నడిపించారని చెప్పారు. సాటి మనిషికి చేతనైనంత సాయం, పొరుగువారిపై ప్రేమ, ప్రతికార్యంలోనూ త్యాగం ఆయన చూపిన బాట అని, ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో పయనించి సుఖ సంతోషాలతో జీవించాలన్నారు. క్రీస్తు బోధనలు ఎప్పటికీ ఆచరణీయమని, ఆయన కృప, కరుణ అందరిపై ఉండాలని ఎంపీ వేమిరెడ్డి ఆకాంక్షి ంచారు.

## పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షుడికి రూరల్ ఎమ్మెల్యే శుభాకాంక్షలు



**నెల్లూరు రూరల్ డిసెంబర్ 24 ప్రభాతవార్త :** నెల్లూరు పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఇటీవల నియమితులైన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర గారిని, నెల్లూరు రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నేటి ఉదయం వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలి పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బీద రవిచంద్రని శాలువాతో ఘనంగా సత్కరించి, నూతన బాధ్యతల్లో విజయ వంతంగా పనిచేయాలని ఆకాంక్షి ంచారు. పార్లమెంటరీ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయ దంలో రవిచంద్ర గారి నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు.అలాగే నెల్లూరు జిల్లా అభివృద్ధి, పార్టీ బలోపేతం, రానున్న రాజకీయ కార్యాచరణపై ఇరువురు నేతలు సాను కూలంగా చర్చించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తెలుగు దేశం పార్టీ ప్రజలకు మరింత చేరువయ్యేలా సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వారు అభిప్రాయపడ్డారు

## పలువురిని పరామర్శించిన బీద రవిచంద్ర



**అల్లూరు, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర బుధవారం అల్లూరుపేటలోని కందల రాజారెడ్డి, మేద రామక్రిష్ణారెడ్డి కుటుంబాలను పరామర్శించారు. కందల రాజారెడ్డి తల్లి సుజాతమ్మ కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంత వారి ఇంటికి బీద రవిచంద్ర వెళ్లి రాజారెడ్డి మరియు కుటుం బసభ్యులను పరామర్శించారు. అనంతరం మాజీ ప్రిన్సిపాల్ మేద రామక్రిష్ణారెడ్డి తండ్రి వెంకటేశ్వర్లురెడ్డి ఇటీవల మరణించడంత ఉత్తరక్రియలు సందర్భంగా వారి ఇంటికి బీద రవిచంద్ర వెళ్లిరామక్రిష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి వెంకటేశ్వర్లురెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## క్రమం తప్పకుండా రేషన్ సరుకులు అందించాలి తహశీల్దార్



**కొడవలూరు,డిసెంబర్ 24 ప్రభాతవార్త :** మండల ప్రజలకు రేషన్ డీలర్లు సకాలంలో అందుబాటులో ఉండి రేషన్ సరకులు ప్రభుత్వ, జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారం వికలాంగులకు, వృద్దులకు ఐదు రోజుల ముందుగానే పంపిణీ చేయాలని తహశీ ల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందించాల్సిన రేషన్ సరుకులు తప్పనిసరిగా ప్రతి ఒక్కరికి పంపిణీ చేయాలి, అవకతవకలు జరిగిన ప్రజలను ఇబ్బంది పెట్టిన చర్యలు తప్పవు. ఈ కార్యక్రమంల డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## బిల్లుపాడు పాఠశాలకు వాటర్ పూరిఫైడ్ విరాళం



**చేజర్ల డిసెంబర్ 24 ప్రభాతవార్త :** చేజర్ల మండలం బిల్లుపాడు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విరబ్యాక్ ఎనిమల్ హెల్త్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో సిఎస్ఆర్ పండ్స్ తరపున బుధవారం 70 వేల రూపాయాలు విలువ చేసే వాటర్ పూరిఫైడ్‌ను విరాళంగా అందజేశారు. విద్యార్థులు త్రాగునీటి సమస్యను తీర్చేందుకు ఈ వాటర్‌పూరిఫైడ్‌ను అందజేయడం జరిగిందని ఆ సంస్థ ప్రతినిది నిఖిల్‌రెడ్డి తెలిపారు. అలాగే ఆ పాఠశాల పూర్వ విద్యార్థి వెటర్నరి డాక్టర్ నాగేంద్ర కార్యక్రమంలో పాల్గోని మాట్లాడుతు ఈ పాఠశాలలో నేను విద్యను అభ్యసించడం జరిగిందని తెలిపారు.ఉత్తమ ఉపాధ్యాయులు బోధన వల్ల చాలా మంది విద్యార్థులు ఉన్నత స్దానాల్లో ఉన్నారని తెలియజేశారు.ఈ విద్యా సంవత్సరం నుండి ఒక పెద్ద విద్యార్థిని దత్తత తీసుకొని వారి చదువు పూర్తయ్యే వరకు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. దీంతో వారిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. వాటర్ ప్యూరిఫైయర్ ను పాఠశాలకు విరాళంగా అందజేయడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపి కొండారెడ్డి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు మాదాల రవిబాబు హమీద్ వెంకటస్వామి గ్రామస్తులు పాల్గొన్నారు.

## రెయిన్‌బో స్కూల్‌లో ఘనంగా సెమి క్రిస్మస్ వేడుకలు



**బుచ్చి డిసెంబర్ 24 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని రెయిన్‌బో స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ చిట్టిబాబు నేతృత్వంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు క్రిస్మస్ గీతాలకు నృత్యాలు చేశారు. అందరికి ఎంతో ఇష్టమైన క్రిస్మస్ తాత వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. విద్యార్థులు క్రిస్మస్ గీతాలకు నృత్యాలు చేశారు. అందరికి ఎంతో ఇష్టమైన క్రిస్మస్ తాత వేషధారణతో అలంకరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాస్టర్ మోసెస్ క్రిస్మస్ వేడుకలలో పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రతి ఒక్కరు దేవుని ప్రేమను స్వయంగా చూడాలని ఏసు ప్రభు ఈలోకానికి వచ్చారని తెలిపారు. సన్మార్గంలో నడిస్తే ఆయన దీవెనలు అందరిపైన ఉంటాయని అన్నారు. ఏసుక్రీస్తు ప్రభువు పుట్టుక లోక రక్షణ కోసం జరిగిందన్నారు. క్రైస్తవ సోదరులు ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అని తెలిపారు. సంతోషం ,సమాదానం, సమృద్దిగా ఈ క్రిస్మస్ అందరి హృదయాలలో ఉండాలని ఆయన విద్యార్థులను దీవించారు. కరస్పాం డెంట్ చిట్టిబాబు, ప్రిన్సిఫల్ ఇలియాజర్, వైస్ ప్రిన్సిఫల్ మమత, పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బీదాను సన్మానించిన పుట్టా అభిమానులు



**బుచ్చి డిసెంబర్ 24 ప్రభాతవార్త** టిడిపి జిల్లా అధ్యక్షులుగా ఎంపికైన బీదా రవిచంద్రను జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యం నా యుడు, ఆయన అభిమానులు ఘనంగా గజమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా పుట్టా సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఎంతో నమ్మకంతో మూడో సారి బీద రవి చంద్రను నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులుగా నియమించడం అభినందనీయమని అన్నారు. పార్టీకోసం శక్తి వంచన లేకుండా కష్టపడే నాయకుడుడ ఎంఎల్‌సి బీదా రవిచంద్ర అని ఆయన కొనియాడారు. ఉపసర్పంచ్ సందాని, నాయకులు ఇస్మాయిల్, గ్రామ అధ్యక్షులు పిడుగు వేణు, నీటి సంఘం డైరక్టర్ అహ్మద్‌బాషా, టిడిపి కార్యకర్తలు బీదాను గజమాలలతో ఘనంగా సన్మానించి వారి అభిమానాన్ని చాటుకున్నారు.

## కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు నిరసన



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 24, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలో అంబూరి మురళి అనే న్యాయ వాదిపై రెండు రోజులు క్రితం జరిగిన దాడిని నిరసిస్తూ కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు నిరసన తెలియచేసారు. న్యాయవాది పై మద్యం మత్తులో ఉన్న సతీష్ అనే వ్యక్తి మరో 1015 మందితో కలిసి వచ్చి రాడ్లు, బాట్‌లతో, కర్రలతో ఆయనపై హత్యాయత్నం చేసి తీవ్రంగా గాయపరిచారు. ఎవరైతే దాడి చేసారో వారిని వెంటనే శిక్షించాలని, గాయపడిన న్యాయవాదికి పోలీసువారు న్యాయం చేయకుండా తిరిగి అద్వకేట్ పై కౌంటర్ కేసు పెట్టారని ప్రతి ఒక్క న్యాయవాది అసహనం తెలియచేసారు. అనంతరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కి వెళ్లి జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి న్యాయవాదికి న్యాయం చేయమని CI E కోరడం జరిగింది. ఈ నిరసనలో నెల్లూరు జిల్లా న్యాయవాదులు సత్తు అంకయ్య, చుక్క రమేష్, పి. గీతావాణి, పచ్చకిరణ్, శివ, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, హరికృష్ణరెడ్డి, వంశీనాథ్, మొబీనా, ఏంజెల్, రూహి పాల్గొన్నారు.

## కంచి కామకోటి పీఠాదిపతిని కలిసిన

### జొన్నవాడ ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ అశోకరెడ్డి, ట్రస్టు బోర్డు మెంబర్లు



**బుచ్చి డిసెంబర్ 24 ప్రభాతవార్త** ఆలయ అభివృద్ధిపై విస్తృత చర్చ ఆశీర్వచనంతో భవిష్యత్తు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు బలమైన దిశానిర్దేశం బుచ్చిరెడ్డిపాళెం మండల జొన్నవాడలోని ప్రసిద్ధ, పురాతన, ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ తిరుమూరు అశోక రెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు వారి కుటుంబసభ్యులతో కలిసి తమిళనాడు రాష్ట్రం కంచిలో ఉన్న కంచి కామకోటి పీఠాదిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామి వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ఆధ్యాత్మిక బేటి సందర్భంగా జొన్నవాడ ఆలయానికి సంబందించిన ప్రస్తుత అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు కల్పిస్తున్న వసతులు సౌకర్యాలు అలాగే రానున్న రోజుల్లో చేపట్టబోయే విశేష పూజలు, యాగాలు, ధార్మిక సభ్యులు ,ఆధ్యాత్మిక కార్యక్రమాలు గురించి సవివరంగా వివరించారు. దీనికి స్పందించిన పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వాముల వారు జొన్నవాడ ఆలయనాకి ఉన్న ప్రాచీన చరిత్ర, ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. భక్తుల విశ్వాసానికి నిలువెత్తు ప్రతీక నిలుస్తున్న జొన్నవాడల ఆలయాభివృద్ధికి తన ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని హామీ ఇచ్చారు. ఆలయ సంప్రదాయాలు, ఆగమశాస్త్రాలకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించాలంటు విలువైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ పరిపాలన, ధార్మిక ఆచారాలు , భక్తుల సౌకర్యాల విస్తరణపై పీఠాదిపతితో సానుకూలమైన ఆలోచనాత్మక చర్చ జరిగింది. అనంతరం ధర్మకర్త మండలి చైర్మన్, ధర్మకర్త సభ్యులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారి ఆశీర్వచనాన్ని స్వీకరించారు. ఈ ఆధ్మాత్మిక కార్యక్రమంలో పలువురు ఆలయ కమీటి సభ్యులు, దేవాదాయశాఖ అధికారులు, భక్తులు పాల్గొని ఈబేటిని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ సహాయ కమీషనర్ ఆర్వభూమి శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్త సభ్యులు నక్కా శివకృష్ణ, జొన్నలగడ్డ వరలక్ష్మీ, పాలూరు చాముండేశ్వరీ, కీలుకుప్ప శ్రీనివాసులు, సూరాయపాళెం ప్రత్యూషా, ముంగర్ సుధాకర్, కొల్లాపూడి శారదా, తదితరులు పాల్గొన్నారు.

## చట్టాన్ని అతిక్రమించి ప్రవర్తిస్తే కఠిన చర్యలు



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 24, ప్రభాతవార్త** చట్టాన్ని అతిక్రమించి అనైతిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చిన్న బజార్ సీఐ చిట్టెం కోటేశ్వంరావు స్పష్టం చేశారు. ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు స్టేషన్ పరిధిలోని పెద్దలు, స్థానికులతో బుధవారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల ఆట కట్టించేందుకు ప్రజల భాగస్వామ్యాన్ని కోరుతూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా స్థానికులతో సమావేశమై సమస్యలు, నివారణ చర్యలు, సైబర్ మోసాల గురించి, గాంజా, ఇసుక అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళలు, బాలబాలికలపై జరిగే నేరాలు, ఇతర చట్టాలు, శిక్షలు గురించి ప్రజలకు అవగాహన కలిగించే ప్రయత్నంచేశారు. తగాదాలు, గొడవలు పడరాదని, అందరూ కలిసి మెలిసి సామరస్యంగా జీవించాలని సూచించారు. ఇసుక, మద్యం, గంజాయి ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణా అడ్డుకట్ట వేయడానికి ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఎవరికైనా అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే డయల్ 112 కానీ తనకు కానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

## వక్ఫ్‌బోర్డు స్థలంలో ఇంటర్నేషనల్ స్కూల్ కట్టిస్తాం : మంత్రి నారాయణ



**నెల్లూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త -వైద్యం** నెల్లూరులోని పరమేశ్వరి నగర్లో ఉన్న ప్రభుత్వ వక్ఫ్ బోర్డు స్థలాన్ని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా ముస్లిం నాయకులు మంత్రి నారాయణకు శాలువాలతో ఘనంగా స్వాగతం పలికారు. పేదలకు హై క్వాలిటీ విద్యను అందించాలన్నదే లక్ష్యంతో వీఆర్ హైస్కూల్ ను ఏర్పాటు చేశామని, ఆ పాఠశాల ఎంతో మందికి నచ్చి దాతలు ముందుకు వచ్చారన్నారు. అబ్దుల్ అజీజ్ తనవద్దకు వచ్చి వక్ఫ్‌బోర్డు స్థలంలో పాఠశాల కావాలని అడిగారన్నారు. అం దులో భాగంగానే ఈ వక్ఫ్‌బోర్డు పరిశీలించడం జరిగిందన్నారు. ఈ వక్ఫ్‌బోర్డు స్థలంలో దాతల సాయంతో ఇంటర్నేషనల్ స్కూల్లో ఏర్పాటు చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. మంత్రి నారాయణ చేస్తున్న కృషి వెలకట్టలేని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో ఒక వక్ఫ్‌బోర్డు స్థలంలో ఇంటర్నేషనల్ స్కూల్‌ను కట్టబోతున్నామని అబ్దుల్ అజీజ్ హర్షం వ్యక్తం చేశారు. మంత్రి నారాయణ దృష్టికి ప్రభుత్వ వర్క్ స్థలంలో పాఠశాల కావాలని అడిగా మని, అడిగిన వెంటనే దాతల సాయంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. మంత్రి నారాయణ స్థలాన్ని పరిశీలించి దాతను ఏర్పాటు చేస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉందని అబ్దుల్ అజీజ్ అన్నారు. ఈ వక్ఫ్‌బోర్డు స్థలంలో 13 ఎకరాల్లో 5 ఎకరాలు పాఠశాలకు, 3 ఎకరాలు మసీదుకు ఏర్పాటు చేస్తామన్నారు. కొంత మంది వక్ఫ్‌బోర్డు స్థలాన్ని రాజకీయాలు చేయడం సరికాదన్నారు. అడిగిన వెంటనే మంత్రి నారాయణ చేసిన చొరవకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, నగర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, స్థానిక టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారం



**సైదాపురం, డిసెంబర్ 24, ప్రభాతవార్త** మండలంలోని రెవెన్యూ సమస్యలు, ఇతర ప్రజా సమస్యలు త్వరిత గతిన పరిష్కరించడం జరుగుతుందని తహసీల్దార్ ఎం. సుభద్ర తెలిపారు. వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజి ట్స్‌లో భాగంగా మండల పరిధిలోని ఊటుకూరు గ్రామంలో మూడవ విడతగా ప్రజా సమస్యల పరిష్కారంపై తహసీల్దార్ ఎం.సుభద్ర ఆధ్వర్యంలో మం డల స్థాయి అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. పలు సమస్యలపై ప్రజల వద్ద నుంచి 26 అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సర్వేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు దశయ్య నాయుడు, ఆర్ఐ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన అదానీ కృష్ణపట్నం పోర్ట్ లక్ష్యం



**ముత్తుకూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త** గ్రామీణ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం అదానీ కృష్ణపట్నం పోర్ట్ కృషి చేస్తుందని అదాని కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీశ్ పటేల్ పేర్కొన్నారు. పోర్టులో బుధవారం అదాని స్కిల్ సెంటర్ ద్వారా వివిధ కంపెనీలో ఎంపికైన వారిని అభినందన సభ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ (ఎఎస్డిసి) ప్రముఖ కంపెనీలలో ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. నైపుణ్య అభివృద్ధి ద్వారా గ్రామీణ యువత మరియు మహిళల సాధికారత కోసం తన మిషన్లో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ (డిడిఇఒ) కోర్సు కింద శిక్షణ పొందిన విద్యార్థులు టాటా ఎలక్ట్రానిక్స్ గ్రూప్, అమర రాజా గ్రూప్‌మంగళ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ నుండి ఉద్యోగ ఆఫర్లను పొందినట్లు తెలిపారు. టి. చంద్రసేన, టాటా ఎలక్ట్రానిక్స్, బెంగళూరు, శ్రీ కళ, టాటా ఎలక్ట్రానిక్స్, బెంగళూరు, ఐ. సంధ్యా, టాటా ఎలక్ట్రానిక్స్, బెంగళూరు, జీవన్ ప్రదీప్, అమర రాజా, తిరుపతి పి. తరుణ్, అమర రాజా, తిరుపతి, ఎంపిక కాగా వారిని సీఈఓ సత్కరించారు."అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ తన స్కిల్లింగ్ ఆర్మ్ ఎఎస్డిసి తో పాటు సిఎస్ఆర్ ఆర్మ్ అదానీ ఫౌండేషన్ ద్వారా వచ్చే ఐదేళ్లలో 5000 మంది స్థానిక యువత మరియు మహిళలను ఉపాధి కల్పించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఇఒ సతీమణి చాందిని పటేల్, ఆయన కుటుంభ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు జిల్లాలో తొలిసారి ట్రాకియల్-వై ఎయిర్‌వే స్టెంటింగ్ విజయవంతం

### డాక్టర్ కోటంరెడ్డి కౌశిక్‌రెడ్డి ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ



**నెల్లూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త -వైద్యం** నెల్లూరు జిల్లాలో ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ రంగం లో ఒక ముఖ్యమైన వైద్య విజయాన్ని సాధించారు. తీవ్రమైన ఎయిర్‌వే అడ్డంకితో బాధపడుతున్న మెటాస్టాటిక్ థైమోమా రోగికి ట్రాకియల్-వై సెల్ఫ్ ఎక్స్ పాండింగ్ మెటాలిక్ ఎయిర్‌వే స్టెంట్ను విజయవంతంగా అమర్చారు. ఈ పక్రియ నెల్లూరు జిల్లాలో తొలిసారిగా నిర్వహించబడింది. 55సంవత్సరాల పురుష ఒగికి ఛాతీ మధ్యభాగంలో (మీడియాస్టినం) పెద్ద ట్యూమర్ ఉన్ననట్లు పీఈటీ-సీటీ స్కాన్ ద్వారా నిర్ధారణ అయింది. ఈ ట్యూమర్ అధిక మెటబాలిక్ కార్యకలాపంతో పాటు, కణజాల విచ్ఛిన్నం, కాల్షిఫికేషన్ లక్షణాలను చూపించింది. అదే విధంగా గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే ముఖ్యమైన రక్తనాళమైన సపీరియర్ వెనా కావా(ఎస్‌వీసీ)ను భాగంగా చుట్టుముట్టి నొక్కి వేస్తున్నట్లు గుర్తించారు. ట్యూమర్ ఛాతీ మధ్య రేఖను దాటి విస్తరించి, శ్వాసనాళం(ట్రాకియా) మరియు ఆహార నాళంపై ఒత్తిడి కలిగించడంతో పాటు, కుడి ఊపిరితిత్తి పై భాగంలోకి చొచ్చుకుపోయింది. దీని వల్ల రోగిలో క్రమంగా పెరుగుతున్న శ్వాసకోశ ఇబ్బందులు కనిపించాయి. మెటాస్టాటిక్ థైమోమా నిర్ధారణ అనంతరం రోగికి కీమోథెరపీ మరియు రేడియోథెరపీ సూచించారు. అయితే రేడియోథెరపీ ప్రణాళిక సమయంలో తీవ్రమైన శ్వాస ఇబ్బందుల కారణంగా రోగి సరిగా పడుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆంకాలజీ బృందం ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కాటంరెడ్డి కౌశిక్‌రెడ్డి అభిప్రాయాన్ని కోరింది. బ్రాంకోస్కోపీ పరీక్షల్లో, ట్యూమర్ శ్వాసనాళంలోకి చొచ్చుకుపోయిదాదాపు 80 శాతం వరకు ట్రాకియల్ లూమెన్ సంకుచితం చేసినట్లు, అలాగే కుడి ప్రధాన బ్రాంకస్‌పై గణనీయమైన ఒత్తిడి ఉన్నట్లు గుర్తించారు. ఈ పరిస్థితి రోగిని తక్షణ శ్వాస వైఫల్య ప్రమాదంలోకి నెట్టింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆధునిక బ్రాంకోస్కోపిక్ పద్ధతిలో ట్రాకియల్-వై సెల్ఫ్ ఎక్స్‌పాండింగ్ మెటాలిక్ స్టెంటును అర్పడం ద్వారా ట్రాకియా రెండు ప్రధాన బ్రాంకస్‌లలో గాలి ప్రవాహాన్ని పునరుద్ధరించారు. స్టెంట్ అమరిక అనంతరం రోగి శ్వాస స్థిరపడింది. తద్వారా తదుపరి ఆంకాలజీ చికిత్సలు కొన సాగించడానికి వీలు కలిగింది. ఈ పక్రియ ద్వారా ట్రాకియా, ద్విపాక్షిక ప్రధాన బ్రాంకస్‌లను కలుపుతూ ఒక స్థిరమైన శ్వాస మార్గ నిర్మాణం సాధ్యమైంది. ప్రస్తుతం రోగి వైద్యపరంగా స్థిరంగా ఉన్నాడని, అతనికి కీమోథెరపీ, రేడియోథెరపీ చికిత్సలు ప్రణాళికలో ఉన్నాయని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్, నెల్లూరు డాక్టర్ కాటంరెడ్డి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ క్లిష్టమైన ఎయిర్‌వే అడ్డంకులు ఉన్న రోగులకు కూడా ఇప్పుడు నెల్లూరు జిల్లాలోనే అత్యాధునిక ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ తరహా విధానాల కోసం పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్, నెల్లూరు డాక్టర్స్ బందం, డాక్టర్ రంగ రామన్ మెడికల్ ఆంకాలజిస్ట్, డాక్టర్ గౌతమ్ క్రిటికల్ కేర్ ఇంటెన్సవిస్ట్, సెంటర్ హెడ్ జి.రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రాణాపాయ స్థితిలో ఉన్న పురిటి బిడ్డ, తల్లి కాపాడిన కిమ్స్‌వైద్యులు



**నెల్లూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త -వైద్యం** కిమ్స్ హాస్పిటల్ నెల్లూరు గైనకా లజీ, పీడియాట్రిక్ డిపార్టుమెంట్‌నందు ప్రా ణాపాయ స్థితిలో ఉన్న పురిటి బిడ్డ, త ల్లికి అత్యవసరం ప్రాణాపాయ స్థితిలో ఉన్న పురిటి బిడ్డకు, తల్లికి అత్యవసరం అయిన టువంటి చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. నెల్లూరు కిమ్స్ ఆసుపత్రిలో మేము ఇటీవల ఒక అరుదైన కీలకమైన వైద్య ఘటనను విజయవంతంగా నిర్వహించగలిగాం. అప్పయ్య కండ్రిగ, ఆమంచర్ల గ్రామం, నెల్లూరు జిల్లాకు చెందిన 9 నెలల గర్భవతి అయిన మహిళకి ప్రసవానికి సుమారు 12గంటల ముందు అనగా 15.12.2025 వ తేదీన రాత్రి 9.30 నిమిషాల ప్రాంతంలో ఆర్గానోఫాస్ఫేట్ అనే పురుగుల మందు తాగింది. ఆమెకు సెన్సోరియంలో మార్పుతో తీవ్రమైన వాంతులు, శ్వాసకోశ ఇబ్బందితో వెంటనే ఆమెను కిమ్స్ హాస్పిటల్, నెల్లూరులోని ఎమర్జెన్సీ డిపార్టుమెంట్‌కు అంబులెన్స్‌లో తీసుకొని వచ్చారు. ఎమర్జెన్సీ డిపార్టుమెంట్‌లో ఇంటుబేట్ చేయడం జరిగింది. ఎమర్జెన్సీ డిపార్టుమెంట్‌లో అవసరమైనటువంటి పరీక్షలు అల్ట్రాసౌండ్ స్కాన్ చేశారు. పిండంలో ఎటువంటి అసాధారణతలు కనిపించలేదు. పిండం డాప్లర్ సాధార ణంగా ఉన్నట్లు గుర్తించబడింది. డాక్టర్ డి.చంద్రశేఖర్‌రెడ్డి, జనరల్ ఫిజిషియన్, డాక్టర్ టి.జి.లక్ష్మీదుర్గ, గైనకాలజిస్ట్, డాక్టర్ జి.సంఘమిత్ర న్యూరో ఫిజిషియన్‌లు ఆమెను పరీక్షించిన తర్వాత ఐసీయూలో అడ్మి షన్ చేశారు. డాక్టర్ వి.జగదీష్ హెచ్ఓడీ ఇంటెన్సివిస్ట్ పర్యవేక్షణలో వైద్యం అందించి పరీక్షలు నిర్వహించిన తర్వాత ఆ విష ప్రభావం గర్భనాళం ద్వారా శిశువుకు చేరింది అని నిర్ధారించారు. 16/12/2025 వ తేదీన అత్యవసర సిజేరియన్ శస్త్ర చికిత్స చేయడం జరిగింది. 36 వారాల ప్రీటెర్మ్ బేబి పుట్టినప్పుడు మంచి రోదనతో పుట్టాడు. అయితే పుట్టిన వెంటనే కను పాపలు చిన్నగా మారడం(మియోసిస్) మరియు నోటిలో అధిక స్రావాలు కనిపించాయి. వెంటనే బేబీని ఎన్ఐసీయుకి షిఫ్ట్ చేసి చికిత్స ప్రారంభించారు. తక్షణమే అట్రోపిన్ ప్రారంభించారు. రక్త పరీక్షల్లో చోలినెస్టరేజ్ స్థాయిలు తక్కువగా ఉండడంతో పామ్(ప్రాలిడోక్సిమ్) కూడాఇచ్చాం. ఈ సమయంలో ఎన్ఐసీయు టీమ్ బేబీని 24 గంటలు నిరంతరం పర్యవేక్షించింది. సుమారు 48 గంటల పాటు అట్రోపిన్, పామ్ చికిత్స అవసరమైంది. తరువాత మెల్లగా మోతాదులు తగ్గించి పూర్తిగా నిలిపివేశాం. అనంతరం క్రమంగా ఫీడ్స్ ప్రారంభించాం. ఈ మొత్తం చికిత్స పక్రియలో కిమ్స్ మేనేజ్‌మెంట్ నుంచి మాకు పూర్తి స్థాయి సహకారం మరియు అవసరమైన సౌకర్యాలు లభించాయి. దాని వల్ల శిశువుకు సమయానికి ఉత్తమ చికిత్స అందించగలిగాం. ఇది వైద్య పరంగా చాలా అరుదైన ఘటన. మా అవగాహన ప్రకారం, ఇది భారతదేశంలో నమోదైన 2వ కేసు, అలాగే ప్రపంచ వ్యాప్తంగా 4వ కేసు. ప్రస్తుతం బేబీ 7వ రోజు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నాడు. ఎలాంటి సమస్యలు లేకుండా ఉన్నాడు. ఈ రోజు డిశ్చార్జ్ చేస్తున్నాం. ఈ విజయం కిమ్స్ నెల్లూరు ఆసుపత్రిలోని వైద్యులు డాక్టర్ ఆర్.భార్గవ్, నియోనాటాలజిస్ట్, డాక్టర్ ఆర్.మురార్జీ, పీడియాట్రిషియన్ అండ్ పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్, డాక్టర్ జి.హిమ బిందు సాయి, పీడియాట్రిషియన్, డాక్టర్ టి.జి లక్ష్మీ దర్గ, గైనకాలజిస్ట్, ఎన్ఐసీయు సిబ్బంది, మేనేజ్‌మెంట్ అందరి సమిష్టి కృషితో సాధ్యమైంది. ఇటువంటి క్రిటికల్ కేసెస్ ఇంతకుముందు చెన్నైవంటి మహా నగరాలలో మాత్రమే అందు బాటులో ఉండేది. ఇప్పుడు నెల్లూరు కిమ్స్‌లో అనుభవజ్ఞులైన వైద్యులచే చికిత్స చేస్తున్నారు. ఈ చికిత్సలో పాల్గొని ఎంతో శ్రమపడి పేషెంట్ ప్రాణాల్ని కాపాడిహాస్పిటల్ పేరు ప్రతిష్టలను గొప్పస్థాయికి తీసుకెళ్తున్నటువంటి వైద్య బృందాన్ని, ఇతర సిబ్బందిని హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.సతీష్ కుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.రోహిణి ప్రియ లక్ష్మీ, మెడికల్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి అభినందించారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరంలాంటిది మంత్రి నారాయణ

-కార్పోరేషన్ కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి
-29మందికిగానూ 22,42,308రుపాయలు చెక్కులను అందించిన మంత్రి
-పేదల సంక్షేమానికి సిఎం చంద్రబాబునాయుడు గారు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు.
-ఎన్నికలు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం మంత్రి నారాయణ వెల్లడి



**నెల్లూరు కార్పోరేషన్, డిసెంబర్ 24 ప్రభాతవార్త** :సిఎం సహాయనిధి పేదలకు ఒక వరంలాంటిదని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్దిశాఖ మంత్రి డాకటర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా కార్పోరేషన్ కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి నారాయణ పంపిణీ చేశారు. 29మందికి 22 42,308రుపాయల చెక్కులు అందజేశారు. సిఎంఆర్ఎఫ్ మంజూరుకు సహకరించిన మంత్రి నారాయణకు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. సిఎం చంద్రబాబు పదికాలాలుపాటు ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ సిఎం సహాయనిధి పేదల పాలిట సంజీవనిల మారిందన్నారు. పేదల ప్రాణరక్షణకు సిఎం రిలీఫ్‌ఫండ్ అండగా నిలుస్తొందన్నారు. అనారోగ్యంతో బాదపడుతున్న పేదల ప్రణాలకు భరోసా కల్పిస్తొందన్నారు. దరఖాస్తు చేసుకొన్న వారందరికి సిఎం సిఎం సహాయనిధి మంజూరు చేస్తున్నారని తెలిపారు. సిటీ నియోజకవర్గంలో ఏడాదిలో 292మందికి 3కోట్ల2లక్షల 12వేల 700రుపాయల చెక్కులు అందచేస్తామని పేదల సంక్షేమానికి సిఎం చంద్రబాబు నాయుడు గారు అత్యధిక ప్రాదాన్యత ఇస్తున్నారన్నారు. మాటమీద నిలబడే ప్రభుత్వం మాదని ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఈకార్యక్రమంలో కమీషనర్ నందన్, రాష్టట వక్ఫ్‌బోర్ద్ ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, రాష్ట్ర వేర్‌హౌస్ కార్పోరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాస్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జడ్పిటిసి విజేతారెడ్డి, నగరపార్టీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పోరేటర్లు, డివిజన్ ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు

### ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్.

**నెల్లూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త -వైద్యం** లోకరక్షకుడు, శాంతి దూత ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఏసుక్రీస్తు కరుణ, ప్రేమ, సహనం మరియు త్యాగం వంటి గొప్ప విలువలను మానవాళికి అందించారని, ఆయన చూపిన శాంతి మార్గం సర్వమానవాళికి ఆదర్శనీయం అని కొనియాడారు. రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, సోదరభావంతో విరాజిల్లాలని ఆయన ఆకాంక్షి ంచారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి పండుగలను జరుపుకోవడం మన సంస్కృతికి నిదర్శనమని, ఈ క్రిస్మస్ ప్రతి ఇంటా వెలుగులు నింపాలని కోరారు.

## ఘనంగా ప్రారంభమైన రావూస్ విద్యాసంస్థల స్పోర్ట్స్ డే వేడుకలు



నెల్లూరు, డిసెంబరు24 ప్రభాతవార్త-విద్య గురువారం నగరంలోని స్థానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో రావూస్ జూనియర్ కళాశాలల స్పోర్ట్స్ డే వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిధులుగా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్.వై.కోటేశ్వరరావు, డైరెక్టర్ వై.శివసంకేత్, సిఈఓ ఎన్.శివారెడ్డిలు పాల్గొని జ్యోతి ప్రజ్వల గావించి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శివసంకేత్ మాట్లాడుతు క్రీడల వలన మానశిక, శారీరక దృడత్వం లబిస్తుందన్నారు. ఇటువంటి పోటీల నిర్వహణతో విద్యార్థుల్లో క్రీడా స్పూర్తి పెంపొందుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సాధారణమని, ఓడిన వారు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి ప్రయత్నించాలని కోరారు. విద్యార్థులకు ఆటవిడుపు కోసం ప్రతి ఏటా స్పోర్ట్స్ డే వేడుకలను నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఖోఖో ,కబ్బడీ, వాలీబాల్, రన్నింగ్, తదితర వాటిలో పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన వారికి కళాశాల వార్షికోత్సవం రోజు బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందని సిఈఓ శివారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ రామాంజనేయులు, శ్రీనివాస్, చంద్రశేఖర్, సిబ్బంది వెంకటాద్రి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాలల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



**నెల్లూరు, డిసెంబరు24 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక వావిలేటిపాటు నారాయన సిబిఎస్సీ పాఠశాల, స్టోన్‌హౌస్‌పేటలోని నారాయణ ఇంగ్లీషుమీడియం పాఠశాల, గోమతి నగర్‌లోని గోమతి నారాయణ, బాలాజీనగర్‌లోని నారాయణ పాఠశాలల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నారాయణ విద్యాసంస్థల జిఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. యేసుక్రీస్తు జన్మించిన పవిత్రమైన రోజును క్రిస్మస్ గా జరుపుకుంటామని, అందరూ ఆయన చూపిన దారిలో నడిచి సమాజఅభివృద్దికి పాటుపడాలన్నారు. విద్యారుల్లో బిన్నత్వంలో ఏకత్వం సాధించాలనే పాఠశాలల్లో పండుగలను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఇలా చేయటం ద్వారా విద్యార్థి దశనుండే ఇతరమతాలపై గౌరభావం పెరుగుతుంని, దృడమైన సమాజ నిర్మాణం సాధ్యమౌతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఏసుక్రీస్తు, మేరిమాత, దేవదూదలు, శాంతాక్లాస్ వంటి వేషధారణల్లో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ముళ్లపూడి రాజేశ్వరి, క్లస్టర్ ప్రిన్సిపాల్ కాంతి, సుధీర్, ఆదిశేషయ్య, వెంకటేష్, మనోజ్‌కుమార్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓవెల్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



**నెల్లూరు, డిసెంబరు24 ప్రభాతవార్త- విద్య** నగరంలోని స్థానిక అన్నమయ్య సర్కిల్‌లోని ఓవెల్ పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడు కలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ముఖ్యఅతిధులుగా విద్యా సంస్థల సిఎండి ఆర్.వేణు, సిఈఓ ఆర్.ప్రమీలలను పాల్గొనివేడుకలను ప్రా రంభించారు. ఈ సందర్బంగా మాట్లాడుతు క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను అందరికి తెలిసేలా జీసెస్ జీవన విధానాన్ని వివ రించారు. శాంతాక్లాస్ చిన్నారులకు బహు మతులు అందజేశారు. ఈ సందర్బంగా విద్యార్థులు జీసెస్, శాంతాక్లాస్, దేవదూతలు, మరియమ్మ వేష దారణలతో ప్రదర్శించిన ప్రదర్శన అందరికి ఆకట్టుకుంది జిఎం.మహ దేవ్, డిజిఎం రఫీ, ప్రిన్సిపాల్ మీనాక్షి, రాజేశ్వరి, ఎజిఎం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ కిషోర్స్‌రత్నంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



**నెల్లూరు, డిసెంబరు24 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక సరస్వతి నగర్‌లోని డాక్టర్ కిషోర్స్‌రత్నం పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా విద్యాసంస్థల జిఎం రామూర్తినాయుడు పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను అందరికి తెలిసేలా జీసెస్ జీవన విధానాన్ని వివ రించారు. తమ విద్యాసంస్థల అధినేతలు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌ల ఆదేశాల మేరకు ఈ వేడుకలను నిర్వహించామని తెలిపారు. అనంతరం శాంతాక్లాస్ చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్బంగా విద్యార్థులు జీసెస్, శాంతాక్లాస్, దేవదూతలు, మరియమ్మ వేషదారణలతో ప్రదర్శించిన ప్రదర్శన అందరికి ఆకట్టుకుంది .సిబ్బంది రాజేష్, అజయ్, నాగేంద్ర, జాస్మిన్, మణిమాల, జ్యోతి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## 26న ఓఎస్-15 స్కీముపై ఆర్టీసీలో పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సు

**నెల్లూరు, డిసెంబరు24 ప్రభాతవార్త-విద్య** ఆర్టీసీ జోన్ 3 పరిధిలో కాళీగా ఉన్న సంస్థ స్థలాలను లీజుకు ఇచ్చే ఓఎస్ 15 స్కీముపై ఈనెల 26న(శుక్రవారం) నగరంలోని స్థానిక ఆర్టీసీ ప్రధాన బస్టాండు ఆవరణలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సును నిర్వహించనున్నామని సంస్థ రీజనల్ మేనేజర్ షేక్.షమీమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు రీజియన్ పరిధిలో కోవూరు బస్టాండులోని 5808 చదరపు గజాల స్థలం, ఆత్మకూరు డిపో బిట్ 2లోని 5450, బిట్3లోని 3115 చదరపు గజాల స్థలాలతోపాటూ జోన్3 పరిధిలోని 28 స్థలాలక సంబందించి వివరాలు, అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. ఈ మేరకు ఈనెల 19న టెండరు కూడా విడుదల చేయటం జరిగిందని, అందరూ పాల్గొని ఈ సదస్సును విజయవంతం చేయాలని ఆమే కోరారు.